
సాక్షి సంగారెడ్డి

గురువారం । 5 । డిసెంబర్ । 2024



దారి తప్పిన గురుకులాలు

గురుకులాల విద్యార్థులు క్రమశిక్షణ తప్పుతున్నారు. భవిష్యత్‌పై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వివరాలు 8లో ▸



హిందువులపై దాడులు ఆపాలి

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఆపాలని హిందూ ఆశ్రమాల పీఠాధిపతులు నేతలు డిమాండ్ చేశారు. వివరాలు 8లో ▸



సైబర్ నేరగాళ్ల బారిన పడొద్దు

అనవసర లింక్‌లు ఓపెన్ చేసి, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని సైబర్ సెల్ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. వివరాలు 9లో ▸

మినీ ఇండియాగా మారుస్తా

విద్య, వైద్యరంగాల అభివృద్ధికే తొలి ప్రాధాన్యం

- చెరువుల శుద్ధి, సుందరీకరణ పనులపై దృష్టి
- భానూర్, ఇంద్రేశం రోడ్ల అభివృద్ధికి రూ.140 కోట్లు మంజూరు
- ఏడాది పాలనపై ఎమ్మెల్యే గూడెం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతోంది. ఇప్పటివరకు ఆయా నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధి, నెలకొన్న సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికలు వంటి అంశాలపై 'సాక్షి' ఆయా నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో ముచ్చటించింది. పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు గూడెం మహిపాల్‌రెడ్డి. ఆయన చేసిన అభివృద్ధి, భవిష్యత్తులో చేపట్టే అభివృద్ధి పనుల్ని 'సాక్షి'తో పంచుకున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గాన్ని మినీ ఇండియాగా మారుస్తానంటూ మహిపాల్‌రెడ్డి చెబుతున్న అంశాలు ఆయన మాటల్లోనే..



సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో మాటా ముచ్చట రేపటి సంచికలో..

పటాన్‌చెరు:

నియోజకవర్గంలో ఉన్న సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉంది. అందుకు తగిన విధంగా అభివృద్ధి ప్రణాళికలు కూడా నా వద్ద ఉన్నాయి. నియోజకవర్గం పరిధిలో పట్టణ ప్రాంతాల విస్తీర్ణంతోపాటు జనావాసాలు పెరిగాయి. అందుకు తగిన విధంగా మౌలిక వసతుల కల్పన జరగాలి. సామాన్యులకు సైతం విద్య, వైద్యం అందుబాటులో ఉండాలి. అందుకే ఈ రెండు రంగాల్లో అభివృద్ధికి పెద్దపీట వేస్తాను.

అందరికీ అందుబాటులోనే...

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సేవలు అందిస్తున్నాను. ఇప్పటివరకు పటాన్‌చెరును అన్ని రకాలుగా అభివృద్ధి చేశాను. గత ప్రభుత్వ హయంలో పటాన్‌చెరుకు మంజూరైన నిధులు రూ.475 కోట్లు కొన్ని కారణాలతో వెనక్కి మళ్లి పోయాయి. వాటిని తిరిగి మంజూరు చేయించేందుకు ప్రయత్నిస్తున్నాను. పటాన్‌చెరు ఒక మినీ ఇండియాగా మార్చేందుకు కృషి చేస్తున్నాను. ఈ నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో కొత్త కాలనీలు వచ్చాయి. కాలనీ ప్రజల అవసరాలకు తగ్గట్టుగా మౌలిక వసతుల్ని కల్పించాల్సి అవసరం ఉంది. అందుకు తగిన ప్రణాళికలతో ముందుకెళ్తున్నాను.

పాఠశాలలు అప్‌గ్రేడ్ చేయాలి

విద్య, వైద్య రంగం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాను. విద్యా రంగం అభివృద్ధి కోసం పాఠశాలల అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం ఉంది. పాఠశాలలు లేని చోట వాటిని ఏర్పాటు చేయడం, జూనియర్ కాలేజీలు లేని చోట కాలేజీలు ఏర్పాటు చేయడం జూనియర్ కాలేజీలు ఉంటే అక్కడ డిగ్రీ కళాశాలల ఏర్పాటుపై దృష్టి పెట్టాను. అన్ని మండలాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేయడంతోపాటుగా కొత్త ఆసుపత్రుల ఏర్పాటుకు కృషి చేస్తున్నాను. ప్రభుత్వ నిధులతో పాటు సీఎస్ఆర్ నిధులతో విద్యా వైద్య రంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నాము.

ఇండోర్ స్టేడియం ఏర్పాటుపై



అన్ని రంగాల అభివృద్ధితోపాటుగా క్రీడారంగంపైనా దృష్టిపెట్టాం. క్రీడల్లో జిల్లా నుంచి అనేకమంది క్రీడాకారులు జాతీయస్థాయిలో ఆడాలి. క్రీడారంగం అభివృద్ధికి ఆటస్థలాలు చాలా ముఖ్యం. అందుకే నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల్లో ఇండోర్ స్టేడియాలను ఏర్పాటు చేయాలనుకున్నాం. ఇందుకు తగిన ప్రణాళికలు తనవద్ద ఉన్నాయి. త్వరలోనే ఇండోర్ స్టేడియాలను ఏర్పాటు చేస్తాం.

చెరువుల శుద్ధీకరణపై...

అమీన్పూర్ పెద్ద చెరువులో ఆ చెరువు పరిసర ప్రాంత కాలనీల నుంచి డ్రైనేజీ నీరు వచ్చి పెద్ద చెరువులో చేరుతుంది. దాంతో ఆహ్లాదాన్ని పెంచాల్సిన చెరువు మురికి కూపంగా మారింది. దాన్ని శుద్ధి చేయాలని ట్రీట్మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అమీన్పూర్ పెద్ద చెరువులోకి మురికి నీరు చేరకుండా ట్రీట్మెంట్ ప్లాంట్ మంజూరుకు ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే పెద్ద చెరువుతోపాటు బంధం కొమ్ము చెరువులకు కాలనీల నుంచి వస్తున్న మురుగునీరు చేరకుండా ట్రీట్మెంట్ ప్లాంట్లను నిర్మిస్తాం.

త్వరలోనే రిజిస్ట్రేషన్ కార్యాలయం, మేజిస్ట్రేట్ కోర్టు...

పటాన్‌చెరు రిజిస్ట్రేషన్ కార్యాలయం మంజూరు అయినప్పటికీ అది నేటికీ కార్యరూపం దాల్చలేదు. వీలైనంత త్వరలోనే రిజిస్ట్రేషన్ కార్యాలయం, మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేస్తాం.

రోడ్లపై...




ప్రధాన రోడ్లు అభివృద్ధి కావాల్సి ఉంది. పటాన్‌చెరు శంకర్‌పల్లి రోడ్డు విస్తరణ అభివృద్ధికి త్వరలో నిధులు మంజూరవుతాయి. పటాన్‌చెరు-ఇంద్రేశం, బేగంపేట వరకు రోడ్డు అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించాము. ఆ రోడ్ల అభివృద్ధి విషయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లాను. రూ.140 కోట్లతో ప్రతిపాదనలు పంపించాను. త్వరలో నిధులు మంజూరు అవుతాయి.

తాగునీటిపై...



నియోజకవర్గం పరిధిలో నీటి సమస్య లేకుండా ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలని చేపట్టాను. మిషన్ భగీరథ కింద అన్ని పట్టణాలు గ్రామాల్లో నీటి పథకాలను నిర్మించారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో నీటి సమస్యలు ఉన్నాయి. బొల్లారం అమీన్పూర్ పట్టణంలో మిగిలిపోయిన కాలనీలో నీటి సరఫరా కోసం కావాల్సిన ప్రాజెక్టులు మంజూరు కోసం ప్రతిపాదనలు రూపొందించాను. నీటి కొరత తీర్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటాను.

చెరువుల సుందరీకరణపై...



సాకి చెరువు అభివృద్ధికి రూ 10 కోట్లు, తిమ్మక చెరువునకు రూ.10కోట్లు నిధులు మంజూరు చేయించాను. ప్రైవేటు సంస్థల నిధులతో పాటు హెచ్ఎండీఏ నిధులు ఆ చెరువుల సుందరీకరణకు మంజూరు చేయించాం. నియోజకవర్గం పరిధిలో ఉన్న చెరువుల పరిరక్షణ, వాటి అభివృద్ధికి ప్రత్యేకమైన ప్రణాళికను రూపొందించాను. త్వరలోనే ఆ పనులు పూర్తి చేయిస్తాను.

మెట్రోరైలు విస్తరణపై...



మెట్రో రైలు ఏర్పాటుకు ఎలాంటి అవాంతరాలు లేవు. ఇప్పటి వరకైతే పటాన్‌చెరు వరకు మాత్రమే మెట్రో రైలు మార్గం మంజూరైంది. ఇస్నాపూర్ వరకు ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయి. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి ముచ్చటను కూడా తీర్చేందుకు కృషిచేస్తాను.

మేకల మండి తరలింపు

త్వరలోనే పటాన్‌చెరుకు మటన్ మార్కెట్, జియాగూడకు మేకల మండి తరలి వస్తుంది. పటాన్‌చెరు మార్కెట్ యార్డ్‌లో వాటిని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నాను.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి : భవానీ చంద్ర



సంగారెడ్డి టౌన్ : రాజీమార్గంతో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర పేర్కొన్నారు. ఈ నెల 14న నిర్వహించే జాతీయలోక్ అదాలత్‌లో సివిల్ తగాదాలు, క్రిమినల్ కాంపౌండ్ కేసులు, బ్యాంకు రికవరీ వంటి కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'సామర్థ్యం పెంచేందుకే న్యాస్‌పరీక్ష'

సంగారెడ్డి ఎడ్యుకేషన్: విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను, సామాజిక వర్గాల వారీగా అంచనా వేయడానికి ప్రతీ మూడేళ్లకు ఒకసారి దేశవ్యాప్తంగా స్వతంత్ర సంస్థ ఎన్సీఈఆర్టీ ఆధ్వర్యంలో న్యాస్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం జిల్లావ్యాప్తంగా 101 పాఠశాలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12–30 వరకు పరీక్షను నిర్వహించారు. 3వ తరగతి నుంచి 772, ఆరో తరగతి నుంచి 741, తొమ్మిదో తరగతి నుంచి విద్యార్థులు న్యాస్ పరీక్షకు హాజరైనట్లు ఆయన వెల్లడించారు.

ఖేడ్‌లో ఓపెన్ డిగ్రీ సెంటర్ ప్రారంభం

నారాయణఖేడ్: ఖేడ్ ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రత్యేక చొరవతో అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ లెర్నింగ్ సపోర్ట్ కేంద్రాన్ని ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.రమేశ్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇంటర్మీడియెట్‌లో ఉత్తీర్ణులై కళాశాలకు రెగ్యులర్‌గా వెళ్లని విద్యార్థులు ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి ప్రవేశాలు పొందవచ్చని సూచించారు.

'పాడి సంపద పెంచాలి'



రైతులతో డాక్టర్ రాంజీ

కల్హేర్ (నారాయణఖేడ్): మారుతున్న కాలానికి అనుగుణంగా మానవ మనుగడ కోసం నాణ్యమైన పాడి సంపద ఉండాలని అందుకు తగ్గట్టుగా పాడి సంపదను పెంచాలని ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ రాంజీ తెలిపారు. బుధవారం సిర్గాపూర్ మండలం కడ్పల్ లో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంలో ఆయన ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పశుసంపద పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం లింగనిర్ధారణ వీర్యం అందుబాటులోకి తెచ్చిందన్నారు. దీని ద్వారా ఆడ దూడలు జన్మిస్తాయని తెలిపారు.

ఖేడ్‌లో 2కే రన్



2కే రన్‌లో పాల్గొన్న ఔత్సాహికులు

నారాయణఖేడ్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఖేడ్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బుధవారం ఖేడ్ పట్టణంలో 2కే రన్ నిర్వహించారు. తహసీల్ గ్రౌండ్ వద్ద పరుగు పోటీలను మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ జెండాఊపి ప్రారంభించారు. తహసీల్ గ్రౌండ్ నుంచి బసవేశ్వర చౌక్ వరకు నిర్వహించిన రన్‌లో కమిషనర్‌తోపాటు పలువురు కౌన్సిలర్లు, యువకులు, పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

గ్యారెంటీలతో మోసం చేశారు

ఖేడ్‌లో బీజేపీ ఆందోళన

నారాయణఖేడ్: ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అటకెక్కించిందని బీజేపీ తీవ్రంగా విమర్శించింది. ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరుతూ ఖేడ్‌లో మంగల్‌పేట్‌లోని దుర్గాభవానీమాత ఆలయం నుంచి రాజీవ్‌చౌక్ వరకు ద్విచక్ర వాహనాలతో బీజేపీ నాయకులు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప, మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి మాట్లాడుతూ...ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించి ప్రజలను మోసం చేశారన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వానివి ఆరు అబద్ధాలు, 66 మోసాలంటూ బుధవారం బీజేపీ ముద్రించిన పలు కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు డా.రవికుమార్ గౌడ్, ఖేడ్ నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్, బీజేపీతోపాటు అనుబంధ సంఘాల రాష్ట్ర, నియోజకవర్గ నాయకులు మారుతీరెడ్డి, పత్తిరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ రాజకీయాలు మానుకో

- సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ నేతలు హితవు
- హరీశ్‌రావుపై కేసులు పెడితే సహించం



సమావేశంలో మాట్లాడుతున్న చింతా ప్రభాకర్

సంగారెడ్డి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రోత్సహిస్తూ ఆయనే ఓ ఫ్యాక్షనిస్టులా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను ఎప్పుడు అమలు చేస్తారని వారు ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రశ్నించే గొంతులను అణచివేయాలని చూస్తూ సహించేదిలేదని హెచ్చరించారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతి కిరణ్, భూపాల్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ...మాజీ మంత్రి హరీశ్‌రావుపై అక్రమంగా బనాయించిన కేసులను వెంటనే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతుంటే కాంగ్రెస్ సర్కార్‌కు మింగుడుపడటం లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ప్రజల పక్షాన పోరాడతామని స్పష్టం చేశారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ...హరీశ్‌రావు, కేటీఆర్, కేసీఆర్‌కు కేసులు కొత్త కాదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేతకాక ఇలా అక్రమ కేసులు బనాయించి భయపెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ మాట్లాడుతూ... ప్రభుత్వంపై హరీశ్‌రావు పెడుతున్న ఒత్తిడి తట్టుకోలేకనే ఇలా అక్రమ కేసులు పెడ్తున్నారన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, నాయకులు జైపాల్‌రెడ్డి, ఆర్.వెంకటేశ్వర్లు, నాగరాజుగౌడ్, విష్ణు, శ్రవణ్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలనపై కళాజాత

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం కళాకారులు ప్రజాపాలనపై కళాజాత ఇచ్చారు. మండలంలోని హుగ్గెళ్లి, గొపన్‌పల్లి, కాశీంపూర్ తదితర గ్రామాల్లో తెలంగాణ సంస్కృతి సారథి కళాబృందం సభ్యులు అయిదాల సునీల్, రమేశ్ తదితరులు ఆటపాటల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కళాకారులు పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి చెబుతూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు ఎం.జీ రాములు, మాజీ సర్పంచ్ రాజు, కిషన్ నాయక్, కళాకారులు దుర్గేశ్, మల్లేశ్, సంధ్య, వినేశ్, నవీన్ పాల్గొన్నారు.

రుణాలు త్వరగా మంజూరు చేయాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి జోన్: ఇందిరా మహిళా శక్తి సంఘాలతో, ఎస్సీ,ఎస్టీ,బీసీ కార్పొరేషన్లకు బ్యాంకు లింకేజీ రుణాలు త్వరగా మంజూరు చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఇందిరా క్రాంతి వంటి ప్రాధాన్యత గల పథకాల కింద రుణాలను త్వరగా అందించాలని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి సంఘాల ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ మహిళలను కోటీశ్వరులను చేయాలనే ప్రభుత్వ సంకల్పానికి బ్యాంకులు సహకారాలు అందించాలన్నారు. రుణాల మంజూరులో సమస్యలు ఎదురవుతున్న చోట వాటిని వెంటనే పరిష్కరించాల్సిన బాధ్యత బ్యాంకులదేనని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్‌బీఐ మేనేజర్ తాన్య, నాబార్డ్ డీడీఎం కృష్ణ తేజ, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ గోపాల్‌రెడ్డి, జానకిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంత కుమారి, పీడీ మెప్మా గీత, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ రామాచారి పాల్గొన్నారు.

క్రీడలు ఆత్మస్థైర్యాన్ని నింపుతాయి

జిల్లా యువజన క్రీడల అధికారి ఖాసీం బేగ్



సంగారెడ్డిలోని తారా ప్రభుత్వకళాశాలలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: క్రీడలు యువతలో ఆత్మస్థైర్యాన్ని నింపుతాయని జిల్లా యువజన, క్రీడల అధికారి ఖాసీంబేగ్ పేర్కొన్నారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా బుధవారం క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా యువజన క్రీడల అధికారి ఖాసీంబేగ్ మాట్లాడుతూ...క్రీడలు వ్యక్తిలో శారీరక సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా మానసిక వికాసానికి తోడ్పడతాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి క్రీడలను జిల్లా రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తుందని తెలిపారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ అశ్విని మాట్లాడుతూ...తమ కళాశాలలో విద్యార్థులకు అన్ని రకాలైన క్రీడలు ఆడేందుకు వీలుగా క్రీడా సామగ్రిని అందుబాటులో ఉంచుతున్నామన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో ప్రాతినిధ్యం వహించేలా వారిని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.జగదీశ్వర్, జిల్లా యువజన, క్రీడల విభాగం అధికారులు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కామరాజు, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ ఇతర అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణపై భిన్నాభిప్రాయాలు

- విచారణకు హాజరైన కమిషన్ డా.జస్టిస్ షమీమ్ అక్తర్
- హాజరైన ఉమ్మడి మెదక్‌లోని సంఘాల నాయకులు



విచారణ కమిషన్‌కు వినతిపత్రం అందిస్తున్న కె.జగన్, అంబేడ్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు

సంగారెడ్డి జోన్: ఎస్సీ వర్గీకరణపై అధ్యయనం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏక సభ్య కమిషన్ బహిరంగ విచారణలో భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వర్గీకరణ జరిగితే ఎస్సీ జాబితాలోని ఉపకులాలన్నింటికీ న్యాయం జరుగుతుందని కొంతమంది, వర్గీకరణతో మాలలకు అన్యాయం జరుగుతుందని మరికొంతమంది విచారణ కమిషన్ ముందు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఇక వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని మరికొంతమంది కోరారు.

కమిషన్‌కు స్వాగతం పలికిన కలెక్టర్

ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో విచారణ చేపట్టి అభిప్రాయాలతో పాటు వినతులను స్వీకరించింది. విచారణకు కమిషన్, మాజీ న్యాయమూర్తి డా.జస్టిస్ షమీమ్ అక్తర్‌తోపాటు కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు డైరెక్టర్ శ్రీధర్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్సీ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి అఖిలేశ్‌రెడ్డి హాజరై వినతులను స్వీకరించారు. జిల్లాకు వచ్చిన కమిషన్‌కు కలెక్టర్ స్వాగతం పలికారు.

సంఖ్యా శాతాన్ని బట్టి రిజర్వేషన్లు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొత్తగా చేపట్టిన కులగణన ప్రకారం ఎస్సీ ఉపకులాలను గుర్తించాలి. ఎస్సీ జాబితాలోని ఉపకులాల జనాభా ఉన్న సంఖ్య ఆధారంగా వారికి రిజర్వేషన్ల సౌకర్యం కల్పించాలి. బహిరంగవిచారణలో వినతి పత్రాన్ని అందించారు.

– కొండాపురం జగన్, అంబేడ్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు

బైండ్లను ఎస్సీ ఏ జాబితాలో చేర్చాలి

ఎస్సీ వర్గీకరణలో బైండ్ల కులాన్ని పాత పద్ధతిలో అయితే ఎస్సీ బీ గ్రూపులో ఉంచి రిజర్వేషన్ 7% నుంచి 10 శాతానికి పెంచాలి. లేదంటే బైండ్లను ఎస్సీ ఏ జాబితాలో చేర్చి రిజర్వేషన్ 8%కు పెంచాలి. ఆర్థికంగా, సామాజికంగా, ఉద్యోగపరంగా, రాజకీయపరంగా వెనుకబడి ఉన్నాం.

– బైండ్ల రామచందర్, యాదగిరి సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు

వర్గీకరణలో భాగంగా తమ అభిప్రాయాలతోపాటు వినతి పత్రాలను అందించేందుకు ఉమ్మడి మెదక్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వచ్చిన వారికి ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకుని అనుమతించారు. జిరాక్స్‌లను సైతం అందుబాటులో ఉంచారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

ఉపకులాలకు న్యాయం

ఎస్సీ వర్గీకరణ న్యాయమైనదే. ఎస్సీ వర్గీకరణతో 59 ఉపకులాలకు సరైన న్యాయం జరుగుతుంది. ఉపకులాలకు అందరికీ సరైన న్యాయం జరగాలంటే ఎస్సీ వర్గీకరణతోనే సాధ్యమవుతుంది. ఎస్సీ వర్గీకరణకు తమ పూర్తి మద్దతు ఉంటుంది.

– ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్, బీహెచ్ఎల్

తీర్పును సుప్రీంకోర్టు పునఃపరిశీలించాలి



ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగబద్ధంగా, న్యాయబద్ధంగా లేదు. సుప్రీంకోర్టు తీర్పును పునఃపరిశీలించి, జాతీయ, రాష్ట్ర మాల-మాల ఉప సంఘాలకు రాజ్యాంగబద్ధమైన న్యాయం చేయాలి. మా వినతులను రాష్ట్రపతికి పంపించాలి.

– జనార్దన్, మాలమహానాడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఎస్సీ వర్గీకరణ తక్షణమే అమలు చేయాలి



సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తున్నాం. ఎస్సీ(ఏ, బీ, సీ, డీ) ఆయా రాష్ట్రాలకు వర్గీకరణ అమలు చేసే అవకాశాన్ని కల్పిస్తూ గతంలో తీర్పు వచ్చింది. వర్గీకరణతో ఎస్సీ జాబితాలో ఉన్న 59 ఉప కులాలకు సమాన న్యాయం జరుగుతుంది. వెంటనే వర్గీకరణను అమలు చేయాలి.

– వివిధ సంఘాల నాయకులు, సంగారెడ్డి జిల్లా

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై స్వయం సహాయక సంఘాలకు రూ.50 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం రుణ సహాయాన్ని అందిస్తుందన్నారు. పొదుపు సంఘాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిలో పొదుపు సంఘాల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రోజా, కమిషనర్ మంగతాయారు, ఆర్‌ఓ నర్సింలు, పొదుపు సంఘాల మహిళలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మహిళా సంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి షేక్ అహ్మద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, సింగపూర్, న్యూజిలాండ్ దేశాల్లోని ప్రఖ్యాత యూనివర్సిటీల్లో పీజీ, డాక్టర్ కోర్సులను అభ్యసిస్తున్న మైనార్టీ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు, పార్శీలు) విద్యార్థులు స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హత కల్గి, ఆసక్తి కల్గిన అభ్యర్థులు 31న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల బృందం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హన్మకొండ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని కృష్ణవేణి బ్రాంజ్ మెడల్ సాధించింది. బుధవారం విద్యార్థినితోపాటు బాక్సింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ సుజాతను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోహర్, ఉపాధ్యాయులు ప్రభ, బాల సరస్వతి పాల్గొన్నారు.

మంత్రిపై అభిమానం



దామోదర చిత్రపటం

దుబ్బాక: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జన్మదినం (గురువారం) పురస్కరించుకొని దుబ్బాక పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు కాముని మల్లికార్జున్ పెన్నుతో ఆయన చిత్రపటాన్ని వేసి శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన అచీవ్‌మెంట్ సర్వే

హాజరైన 2,313 మంది విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాల నిర్ధారణకు కేంద్ర మానవవనరుల శాఖ ఆధ్వర్యంలో పరక్-24 అచీవ్‌మెంట్ సర్వే టెస్ట్‌ను బుధవారం నిర్వహించారు. జిల్లాలోని 97 ప్రభుత్వ పాఠశాలల్లో 3, 6, 9వ తరగతి చదువుతున్న 2,313 మంది విద్యార్థులు ఈ అచీవ్‌మెంట్ టెస్ట్‌లో పాల్గొన్నారు. సర్వేను జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రమేశ్, పరక్-24 అసోసియేట్ జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్ పరిశీలించారు.

పాపతో సహా తల్లి అదృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): రెండేళ్ల పాపతో తల్లి అదృశ్యమైన ఘటన మండల పరిధి శభాష్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన ముచ్చర్ల రమేశ్ గౌడ్‌కి మనోహరాబాద్ మండలం పోతారం గ్రామానికి చెందిన పూజతో మూడేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల కూతురు నిషిత ఉంది. మంగళవారం రాత్రి అందరూ నిద్రించాక కూతురు నిషితతో పూజ అదృశ్యమైంది. గుర్తించిన భర్త రమేశ్ గౌడ్ తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం రమేశ్ గౌడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ బాబోయ్..

ఉరుకులు పరుగులు తీసినా.. కాలంతో పందెం వేసినా.. గజిబిజిగా తిరిగినా.. గందరగోళంగా గడిపినా.. అందరి గమనం భద్రమైన రేపటికోసమే.. అలాగని ఆదమరిచి ప్రయాణం చేస్తే ప్రమాదాలకు అవకాశం ఉంది.. సిద్దిపేట జిల్లా కేంద్రంలో రోజురోజుకూ వాహనాల రద్దీ విరీతంగా పెరుగుతుంది. జిల్లా వ్యాప్తంగా ద్విచక్ర, నాలుగు, మూడు చక్రాల వాహనాల సంఖ్య దాదాపు 1,48,544 వాహనాలు ఉన్నాయి. వాటిల్లో అధిక వాహనాలకు పట్టణంలోనే తిరుగుతుడదంతో పాత బస్టాండ్, విక్టరీ చౌరస్తా, కరీంనగర్ రోడ్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు వస్తున్నాయని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. రోడ్డు దాటేందుకు పాదచారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. –సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



పాత బస్టాండ్ సెంటర్లలో ట్రాఫిక్ రద్దీ



ట్రాఫిక్ జామ్



రోడ్డు దాటడానికి ఇబ్బంది పడుతున్న పాదాచారులు

దారి తప్పిన గురుకులాలు

- ఆందోళన కలిగిస్తున్న వరుస ఘటనలు
- గొడవలు, చోరీలతో పోలీస్‌స్టేషన్ బాట పడుతున్న విద్యార్థులు
- పాఠశాలల్లో నిద్రించని ఉపాధ్యాయులు
- ప్రైవేటు చిట్టీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలపై దృష్టి
- ఆందోళకరంగా పిల్లల భవిష్యత్



హుస్నాబాద్ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయం

హుస్నాబాద్‌రూరల్: గురువుల సంక్షేమంలోనే విద్యార్థులను చేర్పితే చదువులో ముందుంటారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ గురుకుల విద్యాయలయాల్లో పిల్లలను చేర్పిస్తున్నారు. గురుకులంలో చదివిన విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించడం, కార్పొరేట్ విద్యార్థులతో పోటీ పడి చదవుతుండటంతో చాలా మంది గ్రామీణ పిల్లలు గురుకులాల్లో చేరుతున్నారు. కానీ ప్రస్తుతం ప్రస్తుతం గురుకులాల విద్యార్థులు క్రమశిక్షణ తప్పుతున్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఉండటానికి నివాసాలు ఉన్నా అక్కడ ఉండకపోవడంతో విద్యార్థులు గొడవలు పడటం, గోడలు దూకి బయటకు వెళ్లడం చేస్తున్నారు. ఈ ఘటనలన్నీ పోలీస్‌స్టేషన్‌ల వరకు చేరడంతో విద్యార్థుల భవిష్యత్‌పై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

హుస్నాబాద్ డివిజన్ కేంద్రంలో సాంఘీక సంక్షేమ బాలుర గురుకులం, గిరిజన సంక్షేమ బాలురు, బాలికల గురుకులాలు, మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకులంతోపాటు, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, మీర్జాపూర్‌లో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ఈ ప్రభుత్వ గురుకులాల్లో ఉపాధ్యాయులు ఉండేందుకు ప్రత్యేక క్వార్టర్స్‌ను నిర్మించి, తాగునీటి వసతి కల్పించారు. ఉపాధ్యాయులు స్థానికంగా ఉండక పోగా రోజు వంతుల వారీగా రాత్రి విధులు నిర్వహిస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఉపాధ్యాయులు గురుకులంలో నిద్రించకపోవడంతో విద్యార్థులు క్రమశిక్షణ తప్పుతున్నారు ప్రభుత్వం ఉపాధ్యాయులు అలవెన్స్‌లు ఇచ్చినప్పుడు గురుకులంలో ఎందుకు ఉండరని ప్రశ్నిస్తున్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీలు

జిల్లెలగడ్డలోని సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు వసతి, తరగతి గదులతోపాటు ఉపాధ్యాయులకు క్వార్టర్స్ నిర్మించారు. ప్రారంభంలో కొద్ది రోజులు గురుకులంలో ఉన్న ఉపాధ్యాయులు ఆ తర్వాత చీకటి పడగానే ఇండ్లకు వెళ్తున్నారు. పీఈటీ, పీడీలు గురుకులంలో ఉండి విద్యార్థులకు క్రమ శిక్షణ నేర్పించాలి. స్టోర్ గదుల తాళాలు విద్యార్థులకు అప్పగించి వెళ్లిపోవడంతో కొందరు విద్యార్థులు స్టోర్ రూమ్‌లోని సీలింగ్ ఫ్యాన్లను చోరీ చేశారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులను కొట్టారు. అనంతరం శిక్షకు గురైన విద్యార్థులు స్టోర్ ఇన్‌చార్జి, చెప్పిన విద్యార్థి పై దాడి చేశారు. ఈ గొడవ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి పోవడంతో పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. గతంలో ఒక విద్యార్థి కిటికి నుంచి దూకడంతో చేతి విరిగి ఆస్పత్రిలో చేరాడు.

ఉపాధ్యాయులు పాఠశాలల్లోనే ఉండాలి



ప్రభుత్వ గురుకులంలో విద్యార్థులను సీటు వస్తే విద్యావంతులు అవుతారనే నమ్మకం ఉండేది. ఇప్పుడు గురుకులంలో ఉపాధ్యాయులకు క్వార్టర్స్ ఉన్నప్పటికీ ఎందుకు ఉండటం లేదు. విద్యార్థులు గురువుల పర్యవేక్షణలో ఉంటేనే క్రమశిక్షణ అలవాడు పడుతుంది, ఉపాధ్యాయులే లేకపోతే ఎట్లా? ప్రైవేటు భూ దందాలు చేయడం భూ వివాదంలో ఇరుక్కోవడం వల్ల విద్యార్థులకు చదువు చెప్పలేకపోతున్నారు. జిల్లా అధికారులు గురుకులాలను పర్యవేక్షణ చేసి చర్యలు తీసుకోవాలి.

– పి.రవీందర్, బీఎస్పీ నాయకుడు

ప్రైవేటు చిట్టీల వ్యాపారంలో..

హుస్నాబాద్ మైనార్టీ బాలికల గురుకులంలో ఉద్యోగులు ధనార్జన పై ఆశతో ప్రైవేటు చిట్టీల వ్యాపారంలో చేరి మోసపోయిన ఘటన ఇటీవల వెలుగు చూసింది. రూ.లక్ష పెట్టుబడి పెడితే నెల నెలా రూ.20 వేలు తిరిగి ఇస్తామని నమ్మబలిక ఓ వ్యాపారి దాదాపు రూ. 2 కోట్ల వరకు వసూలు చేసి మోసం చేయడంతో ఈ పంచాయితీ కూడా పోలీస్ స్టేషన్‌కు చేరింది. గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో చేరి బోగస్ రిజిస్ట్రేషన్లతో భూ వివాదంలో ఇరుక్కుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

100 టన్నుల అక్రమ ఇసుక స్వాధీనం



ఇసుకను చూపుతున్న పోలీసులు

సిద్దిపేటకమాన్: అక్రమంగా డంప్ చేసిన ఇసుకను పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. సిద్దిపేట పట్టణం నర్సాపూర్ చౌరస్తా శివధర్మకంట సమీపంలో నంగునూర్ మండలం తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన చెల్లారం వెంకటకృష్ణారెడ్డి ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను డంప్ చేశాడు. లారీలో అక్రమంగా రవాణ చేస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు, టూటౌన్ పోలీసు సిబ్బంది దాడి చేసి 100 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కల్లు తాగించి ఆభరణాలు చోరీ

- వృద్ధురాలిని మోసం చేసిన దంపతులు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీఐ వెంకట్ రాజాగౌడ్



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ

రామాయంపేట(మెదక్):వృద్ధురాలికి కల్లు తాగించి ఆమెపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లిన భార్యాభర్తలను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం సీఐ వెంకట్ రాజాగౌడ్ కేసు వివరాలు వెల్లడించారు. గత నెల 30న సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం చెల్లాపూర్ గ్రామానికి చెందిన బైండ్ల నర్సవ్వ అనే వృద్ధురాలు శేరిపల్లిలో ఉంటున్న కూతురు వద్దకు వెళ్లింది. తిరిగి స్వగ్రామానికి వెళ్లడానికి నార్సింగిలో బస్సు ఎక్కింది. అదే బస్సులో ప్రయాణిస్తున్న చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్ తండాకు చెందిన ధరావత్ శ్రీనివాస్, భూలి దంపతులు వృద్ధురాలి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలపై కన్నేశారు. వృద్ధురాలు రామాయంపేటలో బస్సు దిగగానే కల్లు తాగుదామని చెప్పి ఆమెను తీసుకెళ్లి కల్లు తాగించారు. కాళ్లగడ్డ ప్రాంతంలో ఒంటిపై ఉన్న బంగారు గుండ్లు, కమ్మలు, వెండి కడియాలు తీసుకున్నారు. అనంతరం ఆమెను ఆటోలో తీసుకెళ్లి బస్టాండ్‌లో దించి పరారయ్యారు. ఆటో డ్రైవర్ మహిపాల్ వారి ప్రవర్తనను అనుమానించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అతడు తెలిపిన వివరాల ప్రకారం నిందితులను రామాయంపేటలో అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.30వేల నగదుతోపాటు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్‌ను సీఐ సన్మానించారు. దంపతులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సేంద్రియ పంటలు ఆరోగ్యానికి మేలు

- ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ కమిషనర్ యాష్మిన్ బాష
- బందారం గ్రామంలో కలెక్టర్ మనుచౌదరితో కలిసి వ్యవసాయ క్షేత్రం పరిశీలన



కాకర తోటను పరిశీలిస్తున్న ఉద్యానవన కమిషనర్ యాష్మిన్ బాష, అధికారులు

కొండపాక(గజ్వేల్)/నంగునూరు(సిద్దిపేట): సేంద్రియ ఎరువులతో ఉత్పత్తైన ఆహార పదార్థాలు ఆరోగ్యానికి ఎంతో లాభదాయకమని ఉద్యానవన, పట్టుపరిశ్రమ కమిషనర్ యాస్మిన్ బాష పేర్కొన్నారు. కొండపాక మండలంలోని బందారం గ్రామ శివారులో రైతు అమ్మన రాజిరెడ్డి సేంద్రియ ఎరువులతో సాగు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని బుధవారం కలెక్టర్ మనుచౌదరితో కలిసి సందర్శించారు. వ్యవసాయ క్షేత్రంలో కూరగాయల తోటల సాగు తీరులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ పెట్టుబడులు, దిగుబడులు, పండించిన కూరగాయలను మార్కెటింగ్ చేయడం విషయంలో రైతు రాజిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. 35 ఎకరాల్లో సేంద్రియ ఎరువులతో కాకర, బీర తోటలను పందిరి సాగు పద్ధతిలో సాగు చేస్తున్నట్లు రైతు రాజిరెడ్డి కమిషనర్‌కు వివరించాడు. కాకర కాయలను మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ప్యాకెట్లను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యాష్మిన్ బాష మాట్లాడుతూ.. సేంద్రియ ఎరువుల పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసేలా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. సాగుకు అవసరమయ్యే పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తుందన్నారు. ఈ సందర్భంగా రైతు రాజిరెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ రామలక్ష్మి, జిల్లా పట్టుపరిశ్రమ శాఖ అధికారి నిమ్మ ఇంద్రసేనారెడ్డి, ఉద్యానవన అధికారి సువర్ణ, వివిధ శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రోత్సహించాలి : కలెక్టర్

నంగునూరు(సిద్దిపేట): జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు కొత్త రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ మనుచౌదరి ఆయిల్ ఫెడ్ అధికారులకు సూచించారు. నంగునూరు మండలం నర్మేటలో రూ.300 కోట్లతో చేపట్టిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం పనులను బుధవారం షేక్ యాస్మిన్‌బాషాతో కలిసి క్షేత్ర స్థాయి పరిశీలన చేసి మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ పనుల పురోగతి ఓవర్ హెడ్ ట్యాంక్, ల్యాబ్ స్టోరేజ్ భవనం, పామ్ ఫండ్ నిర్మాణాలు, ఫ్యాక్టరీ ప్రాంగణం నుంచి నిర్మాణం దశలు, ఆయిల్ తయారయ్యే విధానం, చేపట్టిన ఇతర నిర్మాణాలను మ్యాప్ ద్వారా ఆయిల్ ఫెడ్ అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారులు, టీజీ ఆయిల్‌ఫెడ్ అధికారులు, తహసీల్దార్, ఎంపీడీఓ పాల్గొన్నారు.

కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి..

చెరువులో పడి మహిళ మృతి

హవేళిఘణాపూర్(మెదక్): కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన ఓ మహిళ చెరువులో పడి మృతి చెందిన ఘటన హవేళిఘణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఔరంగాబాద్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సత్యనారాయణ కథనం మేరకు.. హవేళిఘణాపూర్ మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన బానోత్ నీల(40) నిత్యం కూలి పని కోసం మెదక్ పట్టణానికి వెళ్తుండేది. మూడు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బుధవారం మండల పరిధిలోని ఔరంగాబాద్ శివారులో మహిళ మృతదేహం ఒడ్డున పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన నీల అనే మహిళదిగా గుర్తించినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. నీల మృతిపై ఎలాంటి అనుమానం లేదని కుటుంబీకులు ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో చిరు వ్యాపారి..

గజ్వేల్‌రూరల్: విద్యుదాఘాతంతో చిరు వ్యాపారి మృతి చెందిన ఘటన గజ్వేల్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని బీదర్ జిల్లా తొండిచొడి గ్రామానికి చెందిన వరంజిత్ చౌహాన్(23) బతుకుదెరువు కోసం గజ్వేల్‌కు వచ్చి పానీపూరి బండి నడుపుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. భార్యతోపాటు ఇద్దరు పిల్లలున్నారు. మంగళవారం రాత్రి ఇంట్లో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. సమాచారం తెలుసుకున్న టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, మైనార్టీ నాయకులు ఇక్బాల్, సీఐటీయూ నాయకులు సందబోయిన ఎల్లయ్య, కేవీపీఎస్ నాయకులు కృష్ణమూర్తి బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అనుమానాస్పద స్థితిలో ఉపాధ్యాయుడు



వెంకట్‌రెడ్డి (ఫైల్)

బెజ్జంకి(సిద్దిపేట):అనుమానాస్పద స్థితలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన మండలంలోని బేగంపేట గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గుండ వెంకట్‌రెడ్డి (58) మండలంలోని దేవక్కపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. సుమారు మూడు నెలలుగా మెడికల్ లీవ్‌లో ఉన్నాడు. బుధవారం తోటపల్లి చెరువు వద్ద అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాం. వారు వచ్చి వెంకట్‌రెడ్డిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. ఆరోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.


హిందువులపై దాడులను ఆపాలి



వినతిపత్రం అందిస్తున్న పీఠాధిపతులు, నాయకులు

సంగారెడ్డి జోన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను తక్షణమే ఆపాలని హిందూ సంఘాల ఆశ్రమాల పీఠాధిపతులు నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం సంగారెడ్డి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం డీఆర్‌ఓ పద్మజ రాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాంతియుత నిరసనల్లో హిందువులకు నాయకత్వం వహిస్తున్న ఇస్కాన్ సన్యాసి చిన్మోయి కృష్ణ దాస్‌ను అక్కడి ప్రభుత్వం జైలుకు పంపడం జరిగిందన్నారు. వెంటనే అతడిని జైలు నుంచి విడిపించి దాడులను ఆపాలన్నారు.

కుటుంబ సమస్యలతో వృద్ధుడు ఆత్మహత్య



శంకరయ్య (ఫైల్)

పాపన్నపేట(మెదక్): కుటుంబ సమస్యలతో వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన మండల పరిధిలోని కొడుపాకలో బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ గాలయ్య కథనం మేరకు.. గ్రామానికి చెందిన చాకలి శంకరయ్య (65)కు ముగ్గురు కూతుళ్లతోపాటు కుమారుడు ఉన్నారు. చిన్న కూతురు యశోదను ఇల్లరికం పెట్టుకోగా ఇటీవల ఆత్మహత్య చేసుకుంది. అంతకు ముందు పెద్ద కూతురు కుమారుడు ఆత్మహత్య పాల్పడగా, శంకరయ్య భార్య సైతం మృతి చెందింది. ఒంటరి వాడైన శంకరయ్య కొంత కాలంగా మనో వేదనకు గురవుతున్నాడు. దీంతో మనస్తాపం చెంది ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

క్వారీ గుంతలో యువకుడు గల్లంతు




రవి (ఫైల్)

జిన్నారం (పటాన్‌చెరు): క్వారీ నీటి గుంటలో స్నానానికి వెళ్లి యువకుడు గల్లంతైన ఘటన జిన్నారం మండలం కాజిపల్లి జీఎంఆర్ కాలనీ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మంగళపర్తి గ్రామానికి చిట్యాల రవి, చిట్యాల రఘు ఇద్దరు నాలుగు నెలల కిందట జీఎంఆర్ కాలనీకు వచ్చి కూలీ పనులు చేసుకుంటూ నివసిస్తున్నారు. బుధవారం ఓ క్వారీ సమీపంలోని నీటి గుంటలో స్నానానికి వెళ్లగా రవి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. గజ ఈతగాళ్లతో ప్రయత్నం చేసినా ఆచూకీ లభించలేదు. ఘటన స్థలాన్ని బొల్లారం సీఐ రవీందర్ రెడ్డి సందర్శించగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్థిక విధ్వంసంతోనే పథకాల్లో జాప్యం

- ఏడాది కాలంలో నియోజకవర్గానికి చాలా నిధులు తీసుకొచ్చా
- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి
- మంత్రి పొన్నం ప్రభాకర్



రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని, గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసంతోనే పథకాల అమలులో జాప్యం జరుగుతుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా, ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఎల్లమ్మ దేవాలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజా ప్రభుత్వంలో ఎలాంటి ఇబ్బందులు రావొద్దని, ప్రజా సంక్షేమంలో లోటు లేకుండా చూడాలని ప్రజలంతా బాగుండాలని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే మూడు మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గాలు ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. త్వరలో నాలుగు దేవాలయ కమిటీలకు కొత్త పాలకవర్గాలను నియమిస్తామన్నారు. పని చేసే వారికే పదవులు వస్తాయని, రాష్ట్ర, జిల్లా స్థాయిలో నామినేట్ పదవుల్లో తగిన ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే వారు సిద్ధంగా ఉండాలన్నారు. మహాసముద్రం గండి, ఎల్లమ్మ చెరువు, సర్వాయి పాపన్న కోట, సింగరాయ జాతరలను టూరిజంగా అభివృద్ధి చేస్తామన్నారు. బస్వాపూర్, మొరెటి పల్లె గ్రామాలకు రంగనాయక సాగర్ నుంచి సాగు నీరు అందుతుందని, కొంత భూ సేకరణ జరగాల్సి ఉందన్నారు. సైదాపూర్ కెనాల్‌కు రూ.230 కోట్లు కేటాయిస్తే పూర్తవుతుందని తెలిపారు. ఇప్పటి వరకు దాదాపు రూ.1,000 కోట్లకు పైగా నిధులు హుస్నాబాద్ నియోజకవర్గంలో వివిధ పనుల అభివృద్ధికి విడుదల అయ్యాయని తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, కౌన్సిలర్లు ఉన్నారు.

మాటల మాంత్రికుడు రోశయ్య

ప్రతి పక్షాన్ని మాటల తూటాలు పేల్చడంలో కొట్టకనే కొట్టినట్లుగా మాట్లాడే కొణిజేటి రోశయ్య మాటల మాంత్రికుడని పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం మాజీ ముఖ్యమంత్రి రోశయ్య 3వ వర్ధంతి సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్ చందు, ఆర్డీఓ రామూర్తి, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘ నాయకులు కొత్త శ్రీనివాస్, బెజుగం బాలకిష్టయ్య, చోల్లేటి శంకరయ్య, తణుకు ఆంజనేయులు, తేరాల మారుతి, కొండ్లె రాజేశ్వర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.